# బర్త్ సర్టిఫికేట్

రమణి హాస్పటల్‌కు వచ్చి మెటర్నిటీ వార్డులో అడ్మిట్ అయింది. వెంట పెద్దవాళ్ళు ఎవరూ లేరు. రెండేళ్ళ కొడుకు పదేళ్ళ పనిపాప మాత్రమే తోడుగా వచ్చారు.

నెలలు నిండిందాకా ఆమె హాస్పటల్‌లో చేరలేదు. తీరా నొప్పులు మొదలయ్యాక వచ్చి చేరింది. కాన్పు ఏమాత్రం ఆలస్యం అయ్యేట్టుగా లేదు. డాక్టర్లు అడ్మిషన్ ఇచ్చారు. నర్సులు బెడ్డు ఇవ్వకుండా సరాసరి కాన్పుల గదికి తీసుకుపోయారు.

హాస్పటల్ అంతా హడావుడిగా ఉంది. కాన్పుల వార్డు మరీ గోలగా ఉంది. కాన్పుల గది ఏడుపులూ, పెడబొబ్బలతో నిండిపోయింది.

కాన్పుల వార్డులో, గదిలో, పుట్టిన పిల్లలగోల, పిల్లలు పుట్టబోయే తల్లుల గోల, వీళ్ళకోసం వెంటవచ్చిన వాళ్ళ గోల, నర్సులు, తోటీలు, డాక్టర్లు వస్తూపోతూ అరుస్తూ చేస్తున్న గోల, అంతా వింతలోకం.

నిజంగా ఇది ఈలోకానికి కొత్తలోకం అనుగ్రహించే వింతలోకమే.

నొప్పులు ఎక్కువగా వస్తున్న రమణి ఏడటంలేదు. పిల్లవాడూ ఏడవటం లేదు. పిల్లవాణ్ణి పట్టుకున్న పాపా ఏడవటంలేదు. వీళ్ళు ముగ్గురూ వింత లోకం త్రిమూర్తులే!

రమణిని కాన్పుల గదిలోకి తీసుకుపోతే, వీళ్ళు వరండాలోనే ఉండిపోయారు. ఆమె కోసం మరే బంధువూ రాలేదు. మిత్రులూ రాలేదు. సొంతం వాళ్ళు ఎవరూ రాలేదు.

కాన్పుల గదిలోకి నొప్పులు వచ్చేమనిషి అరుస్తూ పోతుంది, పోయి కేకలు పెడుతుంది. తానేడుస్తుంది, చుట్టూ వచ్చిన వాళ్లనూ ఏడిపిస్తుంది, ఆమెను చూస్తున్న వాళ్ళకు కళ్ళు చెమ్మగిల్లుతాయి. లోపల్నుంచి వచ్చే ఆమె కేకలు వింటున్న వాళ్ళకూ కాళ్ళు నిలవ్వు. పిల్లల్ని కన్నతల్లులు ఆ కష్టం గుర్తుకువచ్చి దుఃఖం ముంచుకు వస్తుంది. పిల్లలు కలగనివాళ్ళు, పిల్లలొద్దు, పీచులొద్దు, ఈ ఏడుపులొద్దు అనుకొంటారు. పెళ్ళికాని వాళ్ళు ఈ క్షణాన పెళ్ళే వద్దు, ఈ పీకలాటలే వద్దు అని తలుస్తారు. సొంతం వాళ్ళు లోపలున్న ఆడగూతుర్ని తలుచుకొని చీదుతారు, ఏడుస్తారు, కళ్ళు తుడుచుకొంటారు, తుడుస్తారు.

నొప్పులు ఎక్కువయినా రమణి ఏడవలేదు. అరవలేదు. ఆమె కోసం వచ్చిన వాళ్ళు గోల చేయలేదు.

రమణికి ఏమీ కాకూడదని వరండాలో గుమికూడిన ఆడవాళ్ళు ముక్కోటి దేవతల్ని ప్రార్థిస్తున్నారు.

ఆమె అరవదేమి, ఏడవదేమి అని బాధపడుతున్నారు, ఏం గుండె ఈ మనిషిది అని ఆలోచిస్తున్నారు, ఎంత ఓర్పు అని ఆశ్చర్యపడుతున్నారు. సులువైన కాన్పు కాబోలునని కుదుట పడుతున్నారు' వాళ్ళు.

ఈ ఆడవాళ్ళు ఆ పాపను 'మీతో ఎవరూ రాలేదా?' అని అడిగారు, రాలేదని జవాబు విన్నారు.

ఈ మగముండా కొడుకు ఏమయ్యాడు అని వాళ్ళు చికాకు పడ్డారు. ఈ తల్లిదండ్రులు ఎక్కడ తగలబడ్డారు అని చింత పడ్డారు.

కాన్పుల గదిలోకి పోయేముందు రమణి కొడుకును ముద్దాడింది. పనిపాప తల నిమిరింది. రెండు గంటల్లో వచ్చేస్తానని చెప్పింది. ఎంత ధీమా? రెండుగంటల్లో రాగలదట! కాలేజికి వెళ్ళిన రమణి రావటానికి మూడుగంటలు పడుతుంది. వాళ్ళిద్దరే ఉండటం వాళ్ళకు అలవాటయింది.

నర్సుల రాకపోకలూ హడావుడీ పెరిగాయి. ఆకొక్క నమిలే ఆయా నిమ్మకు నీరెత్తినట్లు నిదానంగా నడుచుకుంటూ కాన్పుల గదికి పోయింది.

రమణి కాన్పుల గదిలో నొప్పులు పడుతున్నట్లు లేదు. నొప్పులు రాలేదా? ఆగిపోయాయా? ఏమయినా అన్యాయం జరిగిందా? గది వెలుపల ఉన్న ఆడవాళ్ళకు ఆదుర్దాగా ఉంది.

'మీనాన్న రాలేదా?' పిల్లల్ని ఎవరో అడిగారు. వాళ్ళేమీ చెప్పలేదు.

లోపలి నిశ్శబ్దం బయటవాళ్ళకు భయంకర శబ్దకారణమయింది. 'ఏమయింది?' వాళ్ళకు సందేహంగా ఉంది.

సమాధానం చెప్పేవాళ్ళు లేరు. వినాలని ఆసక్తి లేదు, అడిగినవాళ్ళకు.

'మీ వాళ్ళెవ్వరూ రాలేదేం?'

పిల్లలిద్దరూ విని ఊరుకొన్నారు. ప్రశ్న పసివాడికి అర్థం కాలేదు. పనిపాపకు సమాధానం తెలియదు.

ఎవరో పాలు తెచ్చి ఇస్తే పసివాడు తాగాడు. పనిపాప తాగలేదు. హాస్పటల్‌కు వస్తూ ఇద్దరికీ టిఫిన్ పెట్టి తీసుకువచ్చింది రమణి.

కానుపు కాలేదా? కష్టపుకానుపా? ఏమయిందో ఏమిటో అని వరండాలో ఉన్న ఆడవాళ్ళు ఆందోళన పడుతున్నారు.

రమణి కానుపుల గదిలోకి వెళ్ళిన అరగంటకు అరుపు వినిపించింది. ఆమె అరుపుకాదు అది ఉషోదయపు తొలికేక. పసిగొంతు ఏడుపు.

వరండాలో ఉన్న ఆడవాళ్ళకు గండం గడిచి పిండం బయటపడిందని ఊరట. సంతోషం.

అయినా తల్లి మూలుగు కూడా వినిపించటం లేదు.

ఇదేం మనిషే తల్లి! ఇదేం ఒర్పే బాబు! అంటూ ఆడవాళ్ళు ఆశ్చర్యంగా ఉన్నారు.

పసిగొంతు పరమ దౌర్జన్యంగా ఉంది, నిశ్శబ్దాన్ని చీల్చి చెండాడుతూ ఉంది.

ఏమయింది? మీ నాయన రాలేదా? అవ్వాతాతా రాలేదా? ఆమె ఎలా ఉందో? అరవటం లేదు. మూలగటం లేదు. బతికే ఉందా? ఏమీ కాలేదు కదా! ఏమయినా అయితే ఎట్లా? ఈపిల్లలేమవుతారు? వీళ్ళు పట్టరాని దుఃఖంతో ఉన్నారు.

తోటికి బక్కెట్లు ఇచ్చి, బిడ్డను తీసుకొని ఆయా వెళ్ళింది. నర్సులు స్టెచర్ తీసుకువచ్చారు. అందులో రమణి ఉంది. నిద్రపోలేదు. స్పృహ తప్పలేదు. కళ్ళు తెరిచే ఉంది. కొడుకును ముద్దాడింది. పసి పాప తల నిమిరింది. నవ్వుతూ ఉంది. పువ్వులా ఉంది. అలుపెరుగని సైనికురాలులా ఉంది.

స్టెచర్‌లో రమణిని తెచ్చి బెడ్‌మీద పడుకోబెట్టారు. నర్సులతో పాటు నడచి వచ్చిన పిల్లలు మంచమెక్కి కూర్చున్నారు. వాళ్ళకంతా అయోమయంగా ఉంది. దిక్కు తెలియటం లేదు.

వరండాలో ఉన్న ఆడవాళ్ళకు రమణి వింతప్రాణిగా కనిపించసాగింది. ఆమెకు కాన్పుకు ముందు కష్టంలేదు. కాన్పుకష్టంలేదు. కాన్పు తరువాత మూలుగు లేదు. అసలు రమణి బిడ్డను కన్న ఆచూకీ లేదు. నెలలు నిండిన మనిషి లోపలికి పోయిందని కానీ, కాన్పు అయిన మనిషి కాన్పుల గది నుంచి వెలుపలికి వచ్చిందని కానీ ఏమీ అనిపించటం లేదు. ఆమె లోపలికి పోతూ రెండుగంటల్లో వస్తానంది. మాట తప్పకుండా రెండుగంటలకు వెలుపలికి వచ్చింది. అంతా నిశ్శబ్దం. నిశ్శబ్దంలో కాన్పు, నిశ్శబ్ద రమణి కాన్పు.

'కాన్పింత సులువయితే, సుఖమయితే అందరూ కందురే!' ఎవరో అన్నారు.

ఎవరో గొణిగారు. 'ఎవరు కనకుండా మానారు?' మరొకరు వంతపాడారు. 'కష్టమయితే మాత్రం ఎవరు మానతారు?'

ప్రసూతి వైరాగ్యమంటారే! అంతే!

పక్క బెడ్డులో కానుపు అయిన కూతురి అవసరాలు చూడడానికి వచ్చిన అవ్వ గంటకింద నొక్కుకొన్న బుగ్గలోపలికి పోయి, ఇంకా వెలుపలికి రాలేదు. 'నొప్పులు రాలేదా?' అని ప్రశ్నించినప్పుడు బుగ్గ వెలుపలికి వచ్చి యథాస్థానంలోకి చేరిపోయింది.

రమణి జవాబు చెప్పింది. 'వచ్చాయి'

అవ్వ కళ్ళు మొగ్గలల్లా పూలై వికసించాయి ఎంత సంతోషమో! 'మరి అరవలేదేం?'

'నొప్పులు వస్తాయనీ తెలుసు! ప్రసవం కాగానే తగ్గిపోతాయనీ తెలుసు'

'అందుకని అరవనక్కరలేదనుకొన్నావా?'

'అవును'

'అందువల్ల నొప్పులు ఓర్చుకొన్నావా?'

'అవును'

'నొప్పి వచ్చినా, ఎంత నొప్పి వచ్చినా, పురుటి నొప్పి వచ్చినా, నోరు మెదపలేదా?'

'అవును'!

అవ్వకు రమణి మామూలు మనిషిలాగా అనిపించలేదు. దెయ్యమేమో అనుకొంది.

రమణి నవ్వుతూ ఉంది.

ఆ నవ్వు మనుషుల నవ్వే! రమణి మనిషే! మనిషయితే నొప్పులు పడాలి. ఏడవాలి. ఏడవలేదు. ఓర్చుకొంది! ఎంత ఓర్పు!

అవ్వకు ఆరుకానుపులయ్యాయి. ఆరుసార్లూ ఇల్లు పీకి పందిరేసింది. పందిరిపీకి ఇల్లేసింది. అవ్వ పీకిన ఇంటినయినా, పందిరినయినా తనవాళ్ళు మరీమరి సరిచేసేవాళ్ళు.

అవ్వకు కడుపు రావటం అప్పట్లో ఇష్టంగానే ఉండేది. కాన్పు కావటమే కష్టం. అప్పుడు కడుపు రావద్దు అనీ అనుకొనేది.

మళ్ళీ మామూలే! కడుపూ వచ్చేది. కష్టంగా కానుపూ అయ్యేది.

ఆరో కానుపు తర్వాత ఆమె కడుపు కాకుండా జాగ్రత్త పడింది.

ఒక కానుపు అనుభవంతో మరో కానుపుకు మౌనంగా ఉండవచ్చుకదా! అవ్వ ఉండలేకపోయింది.

రెండో కానుపుకీ రమణి మౌనంగా ఉండడం, అంత నొప్పి ఓర్చుకోవడం ఆశ్చర్యంగా ఉంది. అందుకే అనుమానం వచ్చింది. అనుమానం నివృత్తి చేసుకోవటానికి 'మొదటి కానుపుకు నొప్పులు రాలేదా?' అని అడిగింది.

'వచ్చాయి' అంటే 'అరవలేదా?' అని అడిగింది. లేదంటే రమణి వింత ప్రాణిగా కనిపించసాగింది.

ఈమె నొప్పులు పడదు. నొప్పులు ఓర్చుకుంటుంది. మొదటి సారీ అంతే! ఇప్పుడూ అంతే! ఈ ఓర్పు వింతే! ఎవరు ఓర్చుకోగలరు?

రమణి సమాచారం వార్డంతా వ్యాపించింది. అంతా సుఖప్రసవం అనుకొన్నారు. నొప్పుల్లేకుండా కానుపు అయిందనుకొన్నారు. కానీ నొప్పులు వచ్చాయి, ఆమె ఓర్చుకుంది అంటే అందరికీ ఆశ్చర్యంగా ఉంది.

అటెండరు భోజనం తెచ్చాడు. పిల్లలు తిన్నారు. పాలుబ్రెడ్డు ఇచ్చాడు. రమణి మళ్ళీ

తింటానంది.

మేడం డెలివరీ అయిందని కాలేజీలో అందరికి తెలిసిందో లేదో, స్టూడెంట్స్ పిడుగుల్లా వచ్చి పడ్డారు. ఒకపాప విసనకర్ర తీసుకొంది. ఒక విద్యార్థి ఫ్లాస్కుతెచ్చాడు. మరొక విద్యార్థి పళ్ళూ పూలూ తెచ్చాడు.

వార్డు వరండా మొత్తం విద్యార్థులు ఆక్రమించి సొంతం చేసుకున్నారు.

స్టూడెంట్సుకు వాళ్ళ మేడం అంటే అంత ఇష్టం. ఆమె పాఠం వాళ్ళకు ప్రాణం. ఆమె మాట, చేత, ప్రతిపని, ప్రతి కదలిక, ప్రతిశబ్దం, ప్రతినిశ్శబ్దం వాళ్ళకు ఒక చైతన్య సంకేతం. ఆమె అంటే వాళ్ళకు పిచ్చి ఇష్టం. ఆమె వాళ్ళకు ఒక భవిష్యత్తు లాగా, సుదూర స్వప్న తీరంలాగా, చేరుకోబోయే సువిశాల సుందర నందనవన మధుర ప్రాంగణంలాగా అలివిమాలిన అభిమానం.

వాళ్ళు వస్తూ, పోతూ హాస్పటల్ వరండాను రోడ్డు చేసిపెట్టారు. అమ్మ దగ్గరకో, అక్క దగ్గరకో వచ్చినంత ఆత్మీయంగా వచ్చి వెళుతూ ఉన్నారు.

అవ్వ రమణిని అడిగింది.

'మీ అమ్మా నాన్నా?'

'రారు!' రమణి చెప్పింది.

'మీ అత్తా మామా?'

'రారు!'

'ఉన్నారా?'

'ఉన్నారు!'

'మరి మీ ఆయన?'

రమణి సమాధానం చెప్పలేదు.

అవ్వ మరి మాట్లాడలేదు. ఆమెకు భయం కలిగినట్లుంది. రమణి ఏడుస్తుందేమో ననుకొని ఆమె ముఖంలోకి చూసింది. ఆమె ఏడవలేదు. కొడుకు తల నిమురుతూ ఉంది.

పాపం పసివయస్సు, భర్త చనిపోయాడేమో!

అవ్వ రమణి ముఖంలోకి చూసింది. నుదుటిబొట్టు సూర్యోదయంలాగా ఎర్రగా బిర్రుగా అంత గందరగోళంగానూ చెక్కుచెదరకుండా నిశ్చలంగా, నిశ్చయంగా నిండుగా ఉంది.

'వదిలేశాడేమో!' అవ్వకు అనుమానం తీరలేదు.

రమణి బంధువులు ఎవరూ రాలేదు. అమ్మానాన్నలు, అత్తామామలు, అటు పుట్టింటి వాళ్ళు, ఇటు అత్తింటివాళ్ళు ఎవరూ రాలేదు. రమణి కొడుకు తప్పరక్త సంబంధీకులు ఎవరూ

రాలేదు. ఇప్పుడు పుట్టిన ఈ పురుటిగుడ్డు తప్ప, సొంతం వాళ్ళు కనబడటంలేదు. ఆ పసిపిల్ల పనిపాప. ఈ యువతీ యువకులు విద్యార్థినీ విద్యార్థులు. రమణికి వీళ్ళేమీ కారు. అమ్మకూ చెందరు, అత్తకూ చెందరు.

ఏమీ కానివాళ్ళు గుంపులు గుంపులుగా వస్తున్నారు. కుశలప్రశ్నలు వేస్తున్నారు. నవ్వుతూ బదులాడే రమణి మాటలు ఆసక్తిగా గౌరవంగా వింటున్నారు. కొంచెం సేపు ఉంటున్నారు. వెళుతున్నారు. ఆరాత్రి వరండా అంతా విద్యార్థుల రాకపోకలతో మేలుకొనే ఉంది.

వీళ్ళు ఏమీ కానివాళ్ళు అవునో కాదో అవ్వకు అంతు పట్టడం లేదు. ఏమయినా కావలసినవాళ్లు వస్తారో రారో, వస్తే ఎప్పుడొస్తారో, ఏం చేస్తారో తెలియదు.

డాక్టరు వచ్చి, రమణి వివరాలు ఆమెనే అడిగి వ్రాయసాగింది. ఉద్యోగం, కాలేజి, జీతం, చిరునామా, వయస్సు, పూర్తిపేరు ఆమె అడుగుతూ ఉంటే ఈమె చెబుతూ ఉంది. నర్సు వ్రాస్తూ ఉంది. వార్డులో ఉన్న ఆడవాళ్ళు ఆసక్తిగా వింటున్నారు.

'భర్తపేరు?' డాక్టరు అడిగింది.

రమణి మాట్లాడలేదు.

ఆమె మళ్ళీ అడిగింది

'అది అంత అవసరం కాదు'

డాక్టరు కళ్ళు తిరిగాయి, మాట తడబడింది. నర్సుచేయి వణికింది. అవ్వ మతిపోయింది. ఆడవాళ్ళు ముఖాలు ముఖాలు చూసుకొన్నారు. అది అంత అవసరం కాదు' అందరూ గొణుగుతున్నారు.

ముందుగా డాక్టరు తెప్పరిల్లింది. చాలా అర్థం చేసుకున్నదానిలాగా నవ్వింది. జీవితానుభవం అంతా నెరిసిపోయినట్లు తల సవరించుకొంది. తల పంకించింది. అడ్డంగా తిప్పి అడిగింది.

'ఈ బిడ్డ తండ్రిపేరు?'

రమణి నవ్వింది

'అది అంత అవసరం కాదు'

ఈ జవాబు విన్న డాక్టరు కళ్ళుతిరిగాయి. కళ్ళున్నాయి కాబట్టి తిరిగాయి. లేకుంటే తిరిగేవి కావు. ఇంక తిరగనివ్వకూడదని డాక్టరు లేచి నిలబడింది. 'రెస్టు తీసుకో' అంటూ నర్సుల రూంకు పోయింది.

రమణి నిశ్శబ్దంగా ఉంది, ఏడవలేదు. అరవలేదు, కన్నీళ్ళు లేవు. ఆమెలో అసలే భావమూ లేదు.

చిన్నప్పుడు, అతి బాల్యంలో రమణి పుట్టిన రోజుల్లో, ఆమె బుగ్గలమీదికి ఎక్కి కూర్చుని స్వారీచేస్తున్న నవ్వు ఇంకా ఆరిపోలేదు. అరిగిపోలేదు. వన్నె తరిగిపోలేదు. పారిపోలేదు. పలచబడలేదు. అలసిపోలేదు. పసినవ్వు బుగ్గల్లో, ముఖంలో, కళ్ళలో, నుదుటిమీద, ముక్కుమీద, పెదాలపైన ఇంకా బందాడుతూనే ఉంది.

అది అంత అవసరం కాదు, అంటే ఏమిటో అవ్వకు అర్థం కావటం లేదు. బిడ్డ పుట్టింది, తండ్రి అవసరం కాదు, బిడ్డ పెరుగుతుంది, తండ్రి అవసరం కాదు. భూమి గుండ్రంగా ఉందని, అది తిరుగుతుందని, కళ్ళు తిరగడం మొదలు పెట్టిన దగ్గర్నుంచి అవ్వ అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ ఉంది.

రమణి నిద్రపోతున్నప్పుడు మేల్కొన్న అవ్వ, నిద్రపట్టని అవ్వ, తలలోపురుగులు తిరుగుతున్న అవ్వ, అంతా అయోమయంగా ఉన్న అవ్వ, అలసిపోయి నిద్రపోతున్న పనిపాపను లేపింది. తాగటానికి పాలు ఇచ్చింది. తినటానికి పళ్ళు ఇచ్చింది. ముక్కు మూతీ తుడిచింది. బుగ్గలు నిమిరింది. తల నిమిరింది. అక్కున చేర్చుకుంది. ఆపైన అవ్వ పనిపాపను అడిగింది.

'ఈమె మొగుని పేరేమిటి?'

నిద్రమగత వదిలిన పాప చెప్పింది 'తెలియదు'

'పెళ్ళయిందా?'

'తెలియదు!'

మగవాళ్ళు ఎవరయినా ఇంటికి వస్తుంటారా?'

'వస్తుంటారు!'

'ఎవరు?'

'సారు!'

సమాధానం వినగానే అవ్వకు ఆనందం‌గా వుంది. అటునుంచి ఇటు కదిలి కూర్చుంది.

'మంచివాడేనా?'

'చాలా మంచిసారు!'

'చక్కగా ఉంటాడా?'

'చాలా అందంగా ఉంటాడు!'

'ఏం ఉద్యోగం చేస్తాడు?'

'ఏదో పెద్ద ఉద్యోగమే'

అవ్వకు చాలా సంతోషంగా ఉంది. సమాచారం రాబట్టడం వల్ల కలిగే ఆనందమేకాదు, రమణి భర్త ఆచూకీ దొరికినందువల్ల కలిగే సంతోషం.

'మరి సారు ఇక్కడకు రాలేదేం?'

రమణి గాఢనిద్రలోఉంది. పసిబిడ్డ కూడా వళ్లు తెలియని నిద్రలో ఉంది. రమణి బెడ్ పక్కనే చాపమీద నిద్రపోతున్న విద్యార్థిని ఈ మాటల శబ్దానికి లేచి కూర్చుంది. అవ్వ ప్రశ్నలు వింది. పాప జవాబులు వినసాగింది. కొంచెం కొంచెం అర్థం చేసుకోసాగింది.

పాప చెప్పింది. 'సారును మేడం రావద్దు అంది'

'ఎప్పుడూ?'

'ఆ రోజు రాత్రి!'

'అసలేమంది?'

'నీ ముఖం నాకు ఈ జన్మలో చూపకు అంది'

'మళ్ళీ సారు రాలేదా?'

'రాలేదు!'

అవ్వకు నీరసంగా ఉంది. పసిపాప తల నిమిరింది. తన కూతురికి విసనకర్రతో విసిరింది. నిద్రవస్తున్నట్లయి ఆవులించింది. అయినా అడిగింది. 'రాత్రి పూట- ఏ రాత్రి పూటయినా, వేరేసార్లు ఎవరయినా వచ్చేవాళ్ళా?'

'రాలేదు. ఎవరూ రారు, మేం ముగ్గురమే'

పాప కూడా ఆవులించింది. కళ్ళు మూసుకుంది.

'అదికాదు పాపా! మగవాళ్ళు' అంటూ అవ్వ ఏదో అడుగుతూ ఉంది.

చాపమీద పడుకున్నా రమణి విద్యార్థిని కలిగించుకొని 'అవ్వా నీకేం పనిలేదా? పాపనెందుకు సతాయిస్తావు. నిద్రపోనీ' అంది.

'అది కాదమ్మాయి' అని అవ్వ ఏదో అనబోయింది.

'ఏది కాదవ్వా? మేడంకు పెళ్ళి అయిందో? కాలేదో, భర్త ఉన్నాడో ఊడాడో, మీకేమవసరం?'

అవ్వ మూలిగింది. సణిగింది. గొణిగింది. 'ఊరికే తెలుసుకుందామని' అంది.

'తెలుసుకుని ఏం చేస్తారు?'

ఏం చేస్తుందో అవ్వకు తెలియదు. అందువల్ల ఏమి బదులు చెప్పలేదు. మాటయితే ఏదీ ఆమె అనలేదు కానీ తల మాత్రం ఊపింది. ఆమె తలవూపుతూనే ఉంది. పసిబిడ్డ ఉయ్యాల ఊపులో ఆలోచనల మెదడుకు జోల పాడినట్లు అయింది. అవ్వ కళ్ళు మగతగా మూసుకు పోసాగాయి.

రోజులాగే తెల్లవారింది. అవ్వకు ఆ ఉదయం కొత్త ఉదయం. అవ్వకు ఆశ్చర్యం,

పరమ ఆశ్చర్యం వల్ల ఆ ఉదయం అన్ని ఉదయాలులాగా లేదు. రమణి పెళ్ళి విషయం లేదు. భర్త మాటలేదు. సంసార ప్రస్తావన లేదు. పుట్టిన బిడ్డకు తండ్రి పేరు చెప్పే వీలులేదు.

రమణి విద్యావంతురాలు. మంచి ఉద్యోగి. మంచి జీతం ఆమెది. ఆమెకు మంచి పేరుంది. పలుకుబడి ఉంది. సంఘంలో పరపతి ఉంది, గౌరవ మర్యాదలున్నాయి. మాటరానీని, ఈగ వాలనీని విద్యార్థినీ విద్యార్థులున్నారు. ఇంతమంది ప్రేమించే, గౌరవించే, ఆరాధించే రమణి ఇద్దరు పిల్లల తల్లి. వాళ్ళ తండ్రిపేరు ఆమె ఎవరికీ చెప్పదు. వాళ్ళకూ చెప్పదు.

ఉదయమేకాదు, లోకమే అవ్వకు కొత్తగా ఉంది.

డాక్టరు ఉదయం రౌండ్స్‌కు వచ్చింది. రమణి దగ్గర కూర్చుంది. నవ్వుతూ స్నేహితురాలు లాగా మాట్లాడింది.

డాక్టరు అసలు నవ్వదు, సాధారణంగా ఏ బెడ్ దగ్గరా కూర్చోదు. ఇవాళ ఆ రెండూ అతిక్రమించింది.

డాక్టరు గలగలా నవ్వుతూ మాట్లాడుతుంటే రమణి కూడా తోడుగా నవ్వుతూ ఉంది.

రమణికి డాక్టరుకు కాన్పులగదిలోనే పరిచయం. ఎంతో కాలంగా పరిచయమున్న వాళ్ళలాగా మాట్లాడుకొంటున్నారు. అక్కాచెల్లెళ్ళో, అమ్మాకూతుళ్ళో అన్నంత అన్యోన్యంగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

స్టూడెంట్స్ తిరువాళ్ళలో తిరిగినట్లు హాస్పటల్ వరండా అంతా ఏకధాటిగా తిరుగుతున్నారు. ప్రిన్సిపాలూ, మిగతా లెక్చరర్లు వచ్చినప్పుడు మాత్రమే వాళ్ళు కొంచెం వినయంగా తప్పుకు నడిచారు. లేకపోతే ఇష్టారాజ్యం.

'తండ్రిపేరు?' డాక్టరు అడిగింది.

'తల్లిపేరు చాలు!' రమణిచెప్పింది.

'తండ్రిపేరు కాలం నింపాలి'

'గీత గీయండి'

డాక్టరు మళ్ళీ మాట్లాడలేదు. వార్డులో రౌండ్స్‌కి వెళ్ళింది.

వార్డులో గుమిగూడిన ఆడవాళ్ళు అందరూ రమణిని వింతగా చూస్తున్నారు.

రమణికి పెళ్ళయిందా? లేదా? ఇదీ వాళ్ళ సందేహం.

పెళ్ళయి భర్త ఉన్నా, ఊడినా, వాళ్ళకేమీ అభ్యంతరం లేదు.

పెళ్ళికాకుండా తల్లి – అదీ రెండు సార్లు– అయితే వాళ్ళకేదో అభ్యంతరం ఉన్నట్టుగానే ఉంది.

ఈ సందేహం నివృత్తికాక. ఆడవాళ్ళు అందరూ మెటర్నిటీ వార్డు అంతా, హాస్పటల్

అంతా, హాస్పటల్ వంటి ఈ జనమంతా, ఈ ఊరంతా, ఈ దేశమంతా గందరగోళంలో పడ్డట్లే కనిపిస్తుంది.

అవ్వ మాత్రం తేరుకొంది. 'బిడ్డ కలగటానికి మగవాడు చాలు, మొగుడే కానక్కరలేదు' అంది. అవ్వగుండె నిబ్బరంగా ఉంది.

ఆ రోజు హాస్పటల్ నుంచి రమణి డిశ్చార్జి అవుతుంటే వార్డు నిండా వరండా నిండా స్టూడెంట్సే!

'బర్త్ సర్టిఫికేట్ తయారుచేయాలి' అంది డాక్టరు.

'కాలమ్స్ నేను పూర్తి చేస్తాను' అంది రమణి. పూర్తి చేసి ఇచ్చింది, తండ్రి పేరు తిన్నగా గీత గీసింది.

డాక్టరు దాన్నే టైపు చేయించటానికి పంపింది. టైపు అయిన ఫారం మీద డాక్టరు సంతకం చేసింది.

స్టూడెంట్స్ సామాన్లు సర్దారు.

పనిపాప పసివాణ్ణి ఎత్తుకొని, రమణి పైట కొంగు పట్టుకొని నడుస్తుండగా పసిబిడ్డను రెండు చేతుల్లో పొట్టకానించి పట్టుకొని ఆమె హాస్పటల్ వరండాలో, మెటర్నిటీ వార్డు దాటివచ్చి నడిచి పోతూ ఉంది.

వరండాలో డాక్టరు బర్త్‌సర్టిఫికేట్ రమణికిచ్చింది. పసిబిడ్డను, పవిత్రమైన సర్టిఫికేట్‌ను రమణి పొదివి పట్టుకుంది.

'ముప్పై ఏళ్ళ పసిది. ఈ హాస్పటల్‌లో చేరి, భవిష్యత్తులో కొత్త లోకాలకు జన్మనివ్వబోయే పసిదాన్ని ప్రసవించింది' అంటూ డాక్టరు రమణిని కౌగిలించుకుంది.

ఇద్దరి పొట్టల మధ్య పసిగుడ్డు నవ్వుతూ ఉంది.